# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...




: తొక్కిసలాట ఘటనపై సంధ్య థియేటర్‌కు నోటీసులు


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 315 బుధవారం 18 డిసెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# జమిలీపై భగ్గుమన్న విపక్ష ఇండియా కూటమి

**లోక్ సభలో జమిలీ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం జెపిసికి పంపాలని నిర్ణయం**



- బిల్లును వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్
- జెపిసి పంపాలంటున్న విపక్ష పార్టీలు
- బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ
- జెపిసికి పంపేందుకు అధికార పక్షం అంగీకారం
- లోక్ సభలో డివిజన్ కు పట్టుపట్టిన విపక్షాలు
- అంగీకరించిన స్పీకర్ .. ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రారంభం
- జెపిసి కోసం జైకొట్టిన 269 మంది సభ్యులు
- వ్యతిరేకగా ఓటేసిన 198 మంది

2లో.

# విపక్షాల నిరసనల మధ్య బిల్లులకు ఆమోదం



- జీఎస్టీ చట్ట సవరణ, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లుకు శాసనసభ ఆమోదం
- యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్‌వర్సిటీ బిల్లుకు ఆమోదం
- విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం
- వాయిదా తీర్మానాలకోసం పట్టుబడుతున్న బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు
- లగచర్ల ఘటనపై చర్చకు విపక్షాల పట్టు
- సర్దిచెప్పేందుకు యత్నిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు
- నల్లచొక్కాలతో అసెంబ్లీకి బీఆర్ఎస్.. ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై రగడ
- నిరసనల మధ్య శాసనసభ నేటికి వాయిదా



హైదరాబాద్,డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ శాసనసభ మూడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసన మధ్య ఈ బిల్లులకు ఆమోదం తెలిపింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులకు ఆమోదం లభించింది. ఎలాంటి చర్చ లేకుండా బిల్లులను ఆమోదించారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై అసెంబ్లీలో చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టింది. లగచర్ల రైతుకు సంకెళ్లు వేయడంపై చర్చ జరపాలని డిమాండ్ చేసింది. వాయిదా తీర్మానాల కోసం బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్యే శాసనసభ మూడు బిల్లులను ఆమోదించింది. రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఆ తర్వాత సభ నేటికి వాయిదా పడింది. ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై సభలో రగడ చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం అసెంబ్లీ మొదలవగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై మాజీ మంత్రి హరీష్ రావు అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 2024 నవంబర్ వరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,200 కోట్లు అని భట్టి తెలిపారు

మిగతా 2లో.

# ఇళ్లు కూల్చారు సరే... మరీ ఇఎంఐలు ఎవరు కడతారు..?

: ఎమ్మెల్సీ కవిత

కొద్దిగా మానవత్వాన్ని చాటుకోండి




2లో.

# నల్లరంగు దుస్తులు చేతులకు బేడీలు

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే వినూత్న నిరసన**

హైదరాబాద్,డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):
లగచర్ల రైతులకు సంఘీభావంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. నల్ల రంగు అంగీలు, చేతులకు బేడీలు వేసుకుని ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరయ్యారు. ఇదేమి రాజ్యం.. ఖాకీ రాజ్యం.. దోపిడి రాజ్యం, లాఠీ రాజ్యం.. లూఠీ రాజ్యం, రైతులకు సంకెళ్లా సిగ్గు సిగ్గు అంటూ అసెంబ్లీ లాబీల్లో నినాదాలు చేశారు. లగచర్ల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శాసనమండలి సభ్యులు కూడా మండలిలో నల్లరంగు దుస్తులు ధరించి నిరసన తెలిపారు. అంతకుముందు పరిశ్రమల



పేరుతో బలవంతపు భూసేకరణ, రైతుల అరెస్టుపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ అంశాలపై సభలో చర్చించడానికి అనుమతించాలంటూ స్పీకర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వాయిదా తీర్మానం అందజేశారు.



# విచారణ జరపండి.. ఏసీబీకి సీఎస్ లేఖ

హైదరాబాద్,డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఈ-ఫార్ములా రేసులో అక్రమాలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణకు అనుమతించాలని ప్రభుత్వం జిష్ణుదేవ్ వర్మను అభ్యర్థించగా.. ఫార్ములా ఈ-రేస్‌పై విచారణకు తెలంగాణ గవర్నర్ నిన్న అనుమతిచ్చారు.ఈ నేపథ్యంలో ఈ కేసుపై విచారణ జరపాలని రాష్ట్ర సీఎం శాంతి కుమారి తాజాగా ఏసీబీకి లేఖ రాశారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏసీబీకి లేఖ రాసిన సీఎస్%ౌ% ఆ లేఖలో గవర్నర్ ఆమోద లేఖను కూడా జత చేశారు.



# ఈ-కార్ రేస్ పై చర్చకు సిద్ధమే



- అవినీతి ఆరోపణలపై కూడా చర్చకు రెడీ
- దమ్ముంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి
- అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు నిర్వహించాలి
- 100 శాతం రుణమాఫీ నిజమైతే రాజకీయ సన్యాసం చేస్తా
- రేవంత్ కు ఓటేసినందుకు కొడంగల్ ప్రజలు బాధపడుతున్నారు
- రాహుల్ గాంధీ నుంచి కాంగ్రెస్ నేతలు చెప్పినవన్నీ అబద్ధాలే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్,డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త): అసెంబ్లీ సమావేశాలను 15 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని సమస్యలపై చర్చించేందుకు సిద్ధమని తెలిపారు. అవినీతి ఆరోపణలపై కూడా చర్చకు రెడీ అని పేర్కొన్నారు. ఈ %-% కార్ రేస్ అంశంపై కూడా చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. దమ్ముంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. లగచర్ల రైతులనే కాదు.. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కూడా అరెస్టు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే పీడీ యాక్ట్ పెడతామని బెదిరిస్తున్నారని అన్నారు.

మిగతాది 2లో...



2లో.

# హైడ్రా ఏర్పడకముందు ఉన్న నిర్మాణాలను కూల్చబోం

: హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైడ్రా ఏర్పడిన తర్వాత కట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని వెల్లడి

హైడ్రా పేదల జోలికి వెళ్లదన్న రంగనాథ్

# రాష్ట్రపతి ముర్ముకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం

స్వాగతం పలికిన గవర్నర్, సీఎం

శీతాకాల విడిది కోసం నగరానికి వచ్చిన రాష్ట్రపతి

ఈనెల 20న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం

2లో.



# మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని.. కేసీఆర్ సర్కార్ అప్పుల కుప్పగా మార్చేసింది

బీఆర్ఎస్ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం ధ్వజం

2లో.



# జమిలీపై భగ్గుమన్న విపక్ష ఇండియా కూటమి

న్యూఢిల్లీ డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):

దేశంలో ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన బిల్లుల్ని కేంద్రం ఇవాళ పార్లమెంట్ లో ప్రవేశపెట్టింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఇవాళ జమిలి ఎన్నికలకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుల్ని లోక్ సభలో ప్రవేశపెట్టారు. దీనిపై ఆయన మాట్లాడుతూ, "జమిలి ఎన్నికల నిర్వహణ అంశం కొత్తది కాదు. 1983 నుంచి ఈ తరహా ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. దీనివల్ల రాష్ట్రాల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదు. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఇది వ్యతిరేకం కాదు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం కాదు. స్వీడన్, జర్మనీ వంటి దేశాల్లోనూ జమిలి ఎన్నికలు జరుగుతున్నాయి. రాజకీయ కోణంలోనే ప్రతిపక్షాలు ఆలోచిస్తున్నాయి అని అన్నారు. పార్లమెంట్ లో 'ఒక దేశం, ఒక ఎన్నికల బిల్లు భారత ప్రజాస్వామ్యం ఎన్నికల చైతన్యంతో వృద్ధి చెందుతుందని, తరచుగా జరిగే ఎన్నికల స్థానంలో మరింత సమర్థవంతమైన వ్యవస్థ తీసుకొస్తుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి చెప్పారు.

దీనిపై విపక్ష ఇండియా కూటమి భగ్గుమంది. వెంటనే బిల్లులు వెనక్కి తీసుకోవాలని కేంద్రాన్ని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీనికి హోం మంత్రి అమిత్ షా సమాధానం ఇస్తూ, ఈ బిల్లును జేపీసీకి పంపడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.. కేబినెట్ సమావేశంలో మోదీ స్వయంగా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని వెల్లడించారు.

ఈ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ సహా ఇండియా కూటమిలోని విపక్షాలు డిమాండ్ చేశాయి.. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, తమిళనాడు నుంచి డీఎంకే ఎంపీ టిఆర్ బాలు దీనిపై



ఘాటుగా స్పందించారు. ఈ బిల్లును జెపిసికి పంపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి.

జెపిసికి పంపే విషయంలో డివిజన్ కోసం విపక్షాలు పట్టు బట్టాయి.. దీనికి లోక్ సభ ఓం బిర్లా అంగీకారం తెలిపారు.. ఆ వెంటనే ఎలక్ట్రానిక్ ఓటింగ్ నిర్వహించారు.. జెపిసికి పంపేందుకు అనుకూలంగా 269 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 198 మంది సభ్యులు ఓటు వేశారు.

"జమిలి బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం. దీన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి"
– కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ

"రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఈ బిల్లుతో బిడ్ వేస్తున్నారు. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయి"
–ఎస్పీ నేత ధర్మేంద్రయాదవ్

"జమిలి ఎన్నికలంటే రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే. ఇది ప్రజాస్వామ్యానికి వైరస్ లాంటిది. ప్రస్తుతం మనకు కావాల్సింది జమిలి ఎన్నికలు కాదు.. ఎన్నికల సంస్కరణలు. గతంలో ఎన్‌జేఏసీ (నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్మెంట్స్ కమిషన్) బిల్లును కూడా ఇలాగే చర్చ లేకుండా ఆమోదించుకున్నారు. ఆ తర్వాత మౌలిక స్వరూపానికి ఎన్జేఏసీ విరుద్ధమని సుప్రీంకోర్టు దాన్ని కొట్టేసింది. జమిలి ఎన్నికల చట్టం వస్తే దానికీ అదే పరిస్థితి ఎదురవుతుంది"
– టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

"జమిలి ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం. ఇవి అధ్యక్ష తరహా పాలనకు దారితీస్తాయి. ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తాయి"
– మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

"ఇది రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే. జమిలి ఎన్నికల బిల్లును జేపీసీ పంపాలి. లేదా దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి"
– ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియ సూలే

"ప్రతిపక్షాలకు సంస్కరణలంటే అలర్జీ. అందుకే దీన్ని వ్యతిరేకిస్తోంది. జమిలి బిల్లుకు మేం పూర్తిగా మద్దతిస్తున్నాం"
– శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే

## బిల్లుకు టిడిపి మద్దతు

మరోవైపు ఎన్డీయే మిత్రపక్షమైన టీడీపీ ఎంపీ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జమిలి ఎన్నికల బిల్లుల్ని బేషరతుగా సమర్థిస్తున్నట్లు లోక్ సభలో ప్రకటించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని, వికసిత్ ఆంధ్ర 2047 ప్రణాళిక తెచ్చారని, సహకార సమాఖ్య వ్యవస్థకు మద్దతునిస్తున్నారని పెమ్మసాని తెలిపారు. 2019 లోక్ సభ ఎన్నికలకే 6 వేల కోట్లు ఖర్చయిందని ఈసీ చెప్పిందన్నారు. లా కమిషన్, నీతి ఆయోగ్ రిపోర్టులు సైతం జమిలి ఎన్నికలతో ప్రయోజనం ఉంటుందని చెప్పాయన్నారు. అన్ని పార్టీలు కలిపి ఎన్నికల కోసం లక్ష కోట్లు ఖర్చుపెడుతున్నాయన్నారు. జమిలి జరిగితే ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు.

# విపక్షాల నిరసనల మధ్య బిల్లులకు ఆమోదం

**(మొదటి పేజి తరువాయి)**

. అయితే భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై హరీష్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందనేది అవాస్తవమన్నారు. రూ.51 వేల కోట్ల అప్పు చేశామని ఒప్పుకున్నారన్నారు. ఇవాళ మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకున్నారని.. ఒక్క ఏడాదిలో లక్షా 27వేల కోట్ల అప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4 లక్షల కోట్ల అప్పులు చేశామని చెప్పుకొచ్చారు. గోరంతను కొండత చేసి గ్లోబల్స్ ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని హరీష్ మండిపడ్డారు. ఆదాయాన్ని సమకూర్చడంలో కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉందని.. హామీలను నెరవేర్చడమం పెద్ద సమస్యే కాదని ఎన్నికల ముందు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ఏడాది అయింది హామీలు నెరవేర్చమని అడిగితే అప్పుల పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఏడు లక్షల కోట్లు అని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం అంతా తప్పు అని సభ ద్వారా చెబుతున్నట్లు మాజీ మంత్రి తెలిపారు.అయితే హరీష్ రావు వ్యాఖ్యలపై మంత్రి భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను బీఆర్ఎస్ తప్పువదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. అప్పులపై చర్చ జరగాలనే శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. "అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?" భట్టి సవాల్ విసరగా.. అందుకు మాజీ మంత్రి హరీష్ రావు సై అన్నారు. భట్టి సవాల్‌ను స్వీకరిస్తున్నామని.. అప్పులపై చర్చకు సిద్ధమని హరీష్ రావు ప్రకటించారు. మరోవైపు రేవంత్ ప్రభుత్వంపై తాము ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్ అనుమతించాలని సభలో హరీష్ రావు కోరారు. ఇప్పటికిప్పుడు అప్పులపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. సమావేశాలు ముగిసేలోపైనా అప్పులపై చర్చించాలని పట్టుబద్దారు. ప్రభుత్వం చెప్తున్న అప్పులకు, వాస్తవ అప్పులకు తేడా ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై భట్టి మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ సభ్యులా మాపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది. బీఏసీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. గడిచిన పదేళ్లు బీఏసీ ఎలా నిర్వహించారో మర్చిపోయారా? గతంలో పాటించిన నిబంధనలే ఇప్పుడూ పాటించాలి కదా ఎవరైనా రూల్స్ బుక్ ప్రకారమే నడవాలి" అని మంత్రి భట్టి వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక విధ్వంసం చేసిన బీఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడడం ఏంటి? అని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు ఉన్నాయని.. ఆ బిల్లులు పెండింగ్‌లో పెట్టింది బీఆర్ఎస్ అని వ్యాఖ్యలు చేశారు. 40 వేల కోట్ల రూపాయలు బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిందని తెలిపారు. ప్రతి గింజా తామే కొంటామని సివిల్ సప్లయ్‌లో 18 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. హరీష్ రావుకు ఎప్పుడు నిజాలు మాట్లాడే అలవాటు లేదని.. హరీష్ రావు అబద్ధాలు చెబితే అలవాటులో పొరపాటు అనుకున్నామన్నారు. శాసనసభ వ్యవహారాల మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా అబద్ధాలు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. " అప్పుల విషయంలో ప్రభుత్వం చాలా క్లారిటీగా ఉంది. చేసిన అప్పులను దాచే పరిస్థితి లేదు. నిజాలు చెప్తే ప్రివిలేజ్ మోషన్ అంటే ఊరుకోవాలా? ప్రతి ఆరు నెలలకు ఒకసారి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మైండ్ పోతుంది. ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించిన వాళ్లలో మార్పు రావడం లేదు. అప్పులు ఆస్తుల విషయంలో చర్చించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. హరీష్ రావు సవాళ్లు స్వీకరిస్తున్నాను చర్చకు నేను రెడీ" అని మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల చొక్కాలు, చేతులకు బేడీలతో అసెంబ్లీకి వచ్చారు. లగచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినూత్నంగా అసెంబ్లీకి వచ్చారు. రైతులకు బేడీలు వేస్తారా అంటూ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. తెలంగాణ శాసనసభ సమావేశాలు అధికార కాంగ్రెస్ సభ్యులు వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులుగా కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతుల అరెస్ట్ ఘటనపై సభలో చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. చర్చకు బీఆర్ఎస్ ఇచ్చిన పిటిషన్ ను స్పీకర్ ప్రసాద్ కుమార్ తోసిపుచ్చారు. మరోవైపు వాయిదా తీర్మానాల కోసం బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేసినా ప్రయోజనం లేకపోయింది. విపక్షాల నిరసనల మధ్య తెలంగాణ అసెంబ్లీ 3 కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులతో పాటు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లులను రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. విపక్ష సభ్యులు లగచర్లలో రైతుల చేతికి సంకెళ్లు వేయడం దారుణమంటూ విపక్షాలు గగ్గోలు చేస్తుండగా నిరసనల మధ్య మూడు బిల్లులకు ఆమోదం లభించింది. చర్చ జరపకుండా బిల్లులను ఆమోదించడంపై విపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. అనంతరం రాష్ట్రంలో పర్యాటక రంగంలో చేయాల్సిన మార్పులు, నూతన విధానంపై కొంతసేపు చర్చ జరగగా.. తెలంగాణ అసెంబ్లీ బుధవారానికి వాయిదా పడింది. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వచ్చిన బాధలు ఎవరికీ రావద్దని ఏకంగా మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అది కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి కావడం గమనార్హం. తెలంగాణ అసెంబ్లీ మంగళవారం ప్రారంభమైంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇంకా రాలేదని అందరూ అనుకుంటుండగా, కొందరు చేతులకు బేడీలు ధరించి ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ వస్తున్నారు. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ తరహాలో వస్తుంటే కేటీఆర్, హరీష్ రావులు కూడా అదే తరహాలో వస్తారంటూ.. అందరూ ఎదురుచూపుల్లో ఉండగా, ఆ ఇద్దరు మాత్రం సాఫీగా వచ్చారు. అంతేకాదు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ బ్లాక్ షర్ట్స్ ధరించి రావడం విశేషం. ఈ విషయంపై మీడియా కూడా అంతగా దృష్టి సారించని సమయంలో మంత్రి సీతక్క అసెంబ్లీ లాబీ వద్దకు వచ్చారు. సీతక్క మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్ రావులు తమ చేతులకు బేడీలు వేసుకోకుండా, కేవలం ఆ పార్టీ ఎమ్మెల్యేలకు బేడీలు వేయించి నిరసన వ్యక్తం చేయడం చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. ఈ వ్యవహారంతోనే కేటీఆర్, హరీష్ రావుల దొరతనం మరోసారి బయటపడిందన్నారు. నిరసన వ్యక్తం చేయడంలోనూ బీఆర్ఎస్ నేతలో సమానత్వం లేదని, తమ దురహంకారాన్ని కేటీఆర్, హరీష్ లు బయట పెట్టారన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు కనీసం 10 సార్లు బేడీలు వేశారని, అప్పుడు అధికారుల మీద చర్యలు లేవన్నారు. ప్రస్తుతం రైతుకు బేడీలు వేసిన అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసి చర్యలు కూడా తీసుకున్నారన్నారు. ఆమాత్రం కూడా తెలియకుండా బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునేందుకు తెగ తాపత్రయ పడుతుందంటూ మంత్రి సీతక్క అన్నారు. ఇలా మంత్రి సీతక్క చెప్పగానే, మీడియా లాబీలోని ప్రతినిధులు ఔను నిజమే కదా, మనం గమనించలేక పోయామేనంటూ చర్చించుకోవడం విశేషం. మొత్తం మీద సీతక్క చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.

# రాష్ట్రపతి ముర్ముకు ఘన స్వాగతం

హైదరాబాద్,డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏపీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా హకీంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ముర్ముకు తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా ఉన్నారు.కాగా, ఆంధ్రప్రదేశ్ లోని మంగళగిరి



ఎయిమ్స్ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి.. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హకీంపేట చేరుకున్నారు. అక్కడి నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా ఆమె ఐదు రోజుల పాటు బొల్లార్‌లోని రాష్ట్రపతి భవన్‌లో బస చేయనున్నారు. కాగా, రాష్ట్రపతి ముర్ము రేపు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నెల 20న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం జరగనుంది.

# హైడ్రా ఏర్పడకముందు ఉన్న నిర్మాణాలను కూల్చబోం

హైదరాబాద్,డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):

హైడ్రా ఏర్పడకముందు ఉన్న నిర్మాణాల జోలికి తాము వెళ్లబోమని, కానీ హైడ్రా ఏర్పడిన తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను మాత్రం కూల్చివేస్తామని కమిషనర్ (హైడ్రా) రంగనాథ్ తెలిపారు. అంటే జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు.

మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ... గతంలో అనుమతి తీసుకొని ఇప్పుడు నిర్మిస్తున్న నిర్మాణాల వైపు తాము వెళ్లబోమన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటి కూల్చివేతలు మాత్రం తప్పదన్నారు. కొత్తగా అనుమతులు తీసుకుంటే హైడ్రా పరిశీలిస్తుందని తెలిపారు.ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు హైడ్రా పని చేస్తోందన్నారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని స్పష్టం చేశారు. పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేస్తోందనేది తప్పుడు ప్రచారమని, అలాంటి ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు.

# మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని.. కేసీఆర్ సర్కార్ అప్పుల కుప్పగా మార్చేసింది

### బీఆర్ఎస్ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం ధ్వజం

### కొనసాగుతున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

### రాష్ట్ర అప్పులు, రుణ పరిమితిపై మల్లు భట్టి విక్రమార్క ప్రసంగం

హైదరాబాద్,డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగారాష్ట్ర అప్పులు, రుణ పరిమితిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందని ఫైర్ అయ్యారు. పైగా చేసిన అప్పులను దాచేసి.. తిరిగి తమపైనే నిందలు వేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేసిందంతా చేసి తమపైనే ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. విపక్ష సభ్యులు సభకు, సభాపతికి కనీస గౌరవం ఇవ్వకపోవడం శోచనీయం అన్నారు. సభలో ఎవరైనా సరే.. రూల్ బుక్ ప్రకారమే నడుచుకోవాలని తెలిపారు. గత పదేళ్లలో బీఏసీ సమావేశం ఎలా నిర్వహించారో మర్చిపోయారా? అంటూ ఆయన చురకలంటించారు. గతంలో పాటించిన నిబంధనలే ఇప్పుడు తాము పాటించాలి కదా అని డిప్యూటీ సీఎం సెటైర్లు వేశారు.

# ఈ-కార్ రేస్ పై చర్చకు సిద్ధమే

**(మొదటి పేజి తరువాయి)**

కొడంగల్ రైతులు కూడా రేవంత్ రెడ్డికి ఓటేశామని బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. పట్నం నరేందర్ రెడ్డి, లగచర్ల రైతులను అరెస్టు చేసి 35 రోజులైందని తెలిపారు. నాంపల్లి కోర్టులో లగచర్ల రైతులు, పట్నం నరేందర్ రెడ్డి కేసులపై వాదనలు ముగిశాయని చెప్పారు. మనకు అనుకూలంగా తీర్పు రాకుంటే హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా వెళదామని స్పష్టం చేశారు. లగచర్ల రైతులకు న్యాయం జరిగేవరకు సర్కార్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని తుక్కుతుక్కుగా ఓడించే సత్తా పట్నం నరేందర్ రెడ్డికి ఉందని కేటీఆర్ తెలిపారు. నరేందర్ రెడ్డి గుండె ధైర్యానికి సెల్యూట్ చేయాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఏడాది కింద రాష్ట్రమంతటా తిరిగి దొంగ హామీలు ఇచ్చారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై చర్చకు ఎక్కడికైనా సిద్ధమని స్పష్టం చేశారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఎక్కడైనా పూర్తయ్యిందా అని ప్రశ్నించారు. దీనిపై చర్చకు వస్తారా అని సవాలు విసిరారు. ఒక్క ఊళ్లో అయినా వంద శాతం రైతు రుణమాఫీ చేసినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు. ఏడాది కడుపు కట్టుకుంటే 49 కోట్లు మాఫీ చేస్తామని రేవంత్ బీరాలు పలికారని అన్నారు. కానీ ఇప్పటివరకు రైతుల ఖాతాలో 13 కోట్లకు మించి పడలేదని చెప్పారు. వానాకాలంలో రైతుభరోసాను ఎగ్గొట్టిండని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఇచ్చిన రూ.10వేల రైతుబంధు కూడా ఇవ్వడం లేదని అన్నారు. రాహుల్ గాంధీ నుంచి మొదలుపెడితే కాంగ్రెస్ నేతలు చెప్పినవన్నీ అబద్ధాలే అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించేందుకు ఏదైనా ఉపాయం ఉందా అని ప్రజలంతా అడుగుతున్నారని తెలిపారు. నీలి రంగు నక్కను ఎప్పుడు వదిలించుకుందామా అని తెలంగాణ సమాజం ఎదురుచూస్తోందని తెలిపారు. రోషం ఉన్నవాడైతే ప్రజల తిట్లకు రేవంత్ రెడ్డి ఎప్పుడో చచ్చిపోతుండే అని ఎద్దేవా చేశారు.

# ఇళ్లు కూల్చారు సరే... మరీ ఇఎంఐలు ఎవరు కడతారు..?

### : ఎమ్మెల్సీ కవితకొద్దిగా మానవత్వాన్ని చాటుకోండి

హైదరాబాద్,
డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):



కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొట్టిన ఇండ్లకు బ్యాంకు నుంచి అప్పులకు ఇఎంఐలు ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి కడతాడా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా డీపీఆర్ చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు శాసనమండలిలో ప్రస్తావించగా.. ఎమ్మెల్సీ కవిత పలు అంశాలపై ప్రశ్నలు సంధించారు. మూసీ నది విషయంలో డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ రూ. 4100 కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకును ప్రభుత్వ ఆశ్రయించినట్లు మాకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ప్రపంచ బ్యాంకును ప్రభుత్వం ఆశ్రయించిన విషయం వాస్తవమా కాదా..? డీపీఆర్ తయారు కాలేదని ప్రభుత్వం ఈ రోజు సభకు చెప్పింది. ఏ తేదీన ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సాయం కోరుతూ ప్రతిపాదనలు పంపించింది. మూసీ కోసం రూ. 14,100 కోట్ల వ్యయం అవుతుందని, నిధులతో పాటు అనుమతులు ఇప్పించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఏ ప్రాతిపదికన అడిగారు. ఒక వేళ కేంద్రాన్ని సాయం కోరడం, ప్రపంచ బ్యాంకు సాయం కోరడం వాస్తవమైతే సభను, ప్రజలను ఎందుకు తప్పుదోవపట్టిస్తున్నారు..? సభను తప్పుదోవ పట్టిస్తే అవసరమైతే ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెడుతాం అని కవిత హెచ్చరించారు. మూసీ నదిగర్భంలో నివసించే 309 కుటుంబాలు వాళ్లంతట వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతుందన్నారు. కానీ హృదయవిదారకమైన వీడియోలను చూస్తే ప్రభుత్వం చెబుతున్నది అవసస్తవమని స్పష్టమవుతుందని అన్నారు. ఆ 309 కుటుంబాలు సమ్మతిస్తూ ఏవైనా పత్రాలపై సంతకాలు చేసి ఉంటే అవి సభకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 181 కుటుంబాలు తామంతట తామే కూల్చేసుకొని వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోందని, ఇది వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉందన్నారు. మూసీ నిర్వాసితుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కవిత సూచించారు.

# రైతుల పేరెత్తే అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదు

- రాష్ట్రంలో రైతులను నిండా ముంచిన ఘనత వారిది
- అరెస్టులకు భయపడి రైతుల రాగం పాడుతున్న బిఆర్ఎస్ నేతలు
- మీ కపట ప్రేమల, రాజకీయ డ్రామాలకు కాలం చెల్లింది
- యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుల కుల్ల యాకాంతం



వర్ధన్నపేట, డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో రైతులను నిలువునా ముంచిన బిఆర్ఎస్ నేతలు నేడు రైతుల కోసం మొసలి కన్నీరు కార్చుతుండడం సిగ్గు చేటని యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కుల్ల యాకాంతం అన్నారు. లగచర్ల ఘటనలో రైతుల అరెస్టులపై బిఆర్ఎస్ నేడు చేపట్టిన నిరసన కార్యక్రమంపై యాకాంతం ఓ ప్రకటన ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మి అధికారం ఇచ్చిన పజలను గత పదేళ్లలో కోలుకోలేని దెబ్బ తీసిన ఘనులు ఏమి తెలియని ఆమాయకులంమంటూ బిఆర్ఎస్ నేతలు డ్రామాలాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం కేసిఆర్ ఫాం హౌజ్ కోసం సుమారు 14 గ్రామాలకు ఎలాంటి న్యాయం చేయకుండా వేలాది మంది కుటుంబాలను రోడ్డున పడేసిన బిఆర్ఎస్ వారికి రైతుల గురించి మాట్లాడే అర్హత ఉందా? అంటూ యాకాంతం ప్రశ్నించారు. ధరణి పేరుతో రాష్ట్రంలో లక్షలాది మంది బడుగు,బలహీన వర్గాల రైతుల భూములను లాక్కుని, వారి జీవితాలను చిద్రం చేసిన బిఆర్ఎస్ ఏమోహం పెట్టుకుని రైతులు గురించి మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. రాష్ట్రంలో రైతుల నుండి వేలాది ఎకరాల భూములు బలవంతంగా లాక్కుని, వారికి ఏ ఆధారం లేకుండా చేసిన బిఆర్ఎస్ ప్రజాక్షేత్రంలో వారు పలు అభివృద్ధి కార్యక్రమాలు, రిజర్వాయర్ల పేర భూములు లాక్కున్న గ్రామాల్లో పర్యటించగలరా? అంటూ సవాల్ చేశారు. లగచర్ల..లగచర్లని మొత్తుకుంటున్న బిఆర్ఎస్ నేతలు ఇప్పటి వరకు ప్రభుత్వం అక్కడ ఏ రైతు వద్దనైనా బలవంతంగా భూములు లాక్కున్నట్లు నిరూపించగలరా? అంటూ డిమాండ్ చేశారు. కేవలం బిఆర్ఎస్ నేతలు గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై ప్రజా ప్రభుత్వం దృష్టి సారించి దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఎక్కడ వారి అక్రమాలను, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బహిర్గతం చేసి రాజకీయంగా బిఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేస్తారో అన్న భయంతోనే బిఆర్ఎస్ నేతలు కొత్త కుట్రలు చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అక్రమాల వలన త్వరలో జైలుకు వెళ్తున్నారని తెలిసి, మరోసారి రాష్ట్రంలో రాజకీయ కుట్రలకు తెరతీసి, రాజకీయ లబ్ధి పోందే కుటట్రలు చేస్తున్నారని పెర్కోన్నారు. బిఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా మరోసారి ప్రజలు బిఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మే పరిస్థితి లేదనే విషయం గుర్తించాలని అన్నారు. ఈ విషయం తెలిసినా బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రాకుండా ఫాం హౌజ్‌కే పరిమితమయ్యారని అన్నారు. త్వరలోనే కేసిఆర్ చేంతకు హరీష్‌రావు, కేటీఆర్, కల్వకుంట్ల కవిత సహా కీలక నేతలకు రాజకీయ సన్యాసం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగానే ఉన్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో బిఆర్ఎస్ పూర్తిగా భూస్థాపితం కావడం ఖాయమని యాకాంతం ఆశాభావం వ్యక్తం చేశారు.

## బోథ్ నూతన సీఐగా ఏ వెంకటేశ్వర రావు




బోథ్/ డిసెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): బోథ్ నూతన సీఐగా ఏ వెంకటేశ్వర రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. అనంతరంవారు మాట్లాడుతూ బోథ్ సర్కిల్ పరిధిలో ఎలాంటి గంజాయి పండించిన్నా, అమ్మకాలు చేసినా, సేవించడం నా, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు గురిచేసినా అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటమాని తెలిపారు . బోథ్ సర్కిల్ పరిధిలో గ్రామాన్ని సందర్శిస్తూ ప్రజలకు మాదకద్రవ్యాల పై అవగాహన కల్పిస్తూ, విద్యార్థులను మాదకద్రవ్యాల కు దూరంగా ఉందేవిదంగా చర్యలు తీసుకొంటామన్నారు . బోథ్ సీఐగా నియమితులైన ఏ వెంకటేశ్వరరావు గతంలో జి ఆర్ పి నుండి ఆదిలాబాద్ బోథ్ సిఐ గా ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. 2009 బ్యాచ్ లో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా పోలీస్ వ్యవస్థలోకి అడుగుపెట్టి వివిధ పోలీస్ స్టేషన్లో నందు విధులను నిర్వర్తించి 2017 సంవత్సరంలో సీఐగా పదోన్నతి పొంది మహబూబాబాద్ సిసిఎస్, భద్రాద్రి కొత్తగూడెం టేకులపల్లి లలో విధులను నిర్వర్తించి ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా బోథ్ కు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిసి దుర్గం శ్రీనివాస్, బోథ్ ఎస్ఐ ప్రవీణ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించండి

### -బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్



బోథ్/ డిసెంబర్ 17( జర్నలిస్ట్ వార్త): ఇటీవల బజార్ హత్నూర్ మండలం లోని డెడ్రా గ్రామంలో చిరుత పులి దాడిలో తీవ్ర గాయాలపాలై ఆదిలాబాద్ రిమ్స్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మహిళ ను మంగళవారం పరామర్శించిన నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పరమర్శించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ తో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సందర్బంగా ఆయన వెంట ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ చరణ్ గౌడ్ బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉప అధ్యక్షులు సామ రుపేస్ రెడ్డి, నేరడిగొండా మండల అధ్యక్షులు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు హీర్ సింగ్, బోథ్ మాజి ఎంపీటీసీ కురుమే మహేందర్ , యువ నాయకులు ఆడె జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్ ఎఫ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ నాయకులు




బోథ్/ డిసెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆదేశాల మేరకు నేరేడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన నాయుడి రాజన్న కి మంగళవారం సీఎం సహాయ నిధి కింద మంజూరైన 60000/- వేల రూపాయల విలువగల చెక్కును కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడు రవి వీడీసీ చైర్మన్ గాదె సంతోష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమం లో పాలశంకర్ నవీన్ మహేందర్ బొలిశెట్టి రాములు ఉషన్న పెదబాబు రామకృష్ణ ఇసాక్, రహిల్, ఆసిఫ్, కుంట శంకర్, మున్నూరు కాపు పెద్ద కాపు నరసయ్య తదితరులు ఉన్నారు.

# లగచర్ల రైతులపై అక్రమ కేసులు కొట్టివేయ్యాలి

బోథ్/ డిసెంబర్17(జర్నలిస్ట్ వార్త): లాగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను కొట్టివేయ్యాలని బీ ఆర్ ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమం చేపట్టమని తెలిపారు.రైతులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బోథ్ (సొనల)మండల కేంద్రంలోని డా. బీఆర్ అంబెడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని బోథ్(సొనల) మండల బీఆర్ఎస్ నాయకులు అందజేసినట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## బాలికలను అభినందించిన ఆడే గజేందర్



బోథ్/డిసెంబర్ 17(జర్నలిస్ట్ వార్త): క్రీడలోనూ బుగ్గారం గురుకుల బాలికల పాఠశాల ఉన్నత ప్రతిభను సాదించాలని బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని బుగ్గారం గురుకుల బాలికల పాఠశాలలో బాలికలు కబడ్డీ టోర్నమెంట్ జిల్లా స్థాయి పోటీల్లో రెండవ స్థానంలో గెలుపొందగా బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ అభినందించారు. ఇసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో వెళ్లాలని విద్యార్థుల కు ప్రోత్సహించారు. గేమ్స్ ఆడటం వలన మానసికంగా భౌతికంగా యాక్టివ్గా ఉంటారని చెప్పారు.

## బోథ్ సీఐ వెంకటేశ్వరరావు ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



బోథ్/ డిసెంబర్ 17( జర్నలిస్ట్ వార్త):నూతనంగా బోథ్ సీఐ గా బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకటేశ్వరరావు ను మంగళవారం కాంగ్రెస్ నాయకులు మరియాదగా పూర్వకంగా కలిసి శాలువా కప్పి బొక్కే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్ పర్సన్ పసుల చంటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేరుగు భోజన్న తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న పంటలో సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలి



రాయపర్తి/డిసెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):మొక్కజొన్న పంటలో రైతులు విధిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ తెలిపారు. మంగళవారం మండలం లోని కొండాపురం గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలి%శీ%చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు జీరో టిలేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని అన్నారు. ఈ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుందని అన్నారు. ఈ పద్ధతిలో దుక్కి చేయకుండా వరి కోసిన పొలంలో నే నేరుగా మొక్కజొన్న విత్తనం ట్రిల్లర్ తో గాని డిగ్గర్ తో గాని విత్తనాన్ని వితుక్కోవచ్చు. దున్నడం లేకుండా మరియు దమ్ము చేయకుండా డైరెక్ట్ గా మొక్కజొన్న విత్తనాన్ని తక్కువ ఖర్చు తోటి ఎక్కువ ఆదాయం పొందవచ్చు అన్నారు. మొక్కజొన్న పంటలో ప్రస్తుతం సస్య రక్షణ పద్ధతుల గురించి తెలియజేయడం జరిగింది. మొక్కజొన్నలు లో కత్తెర పురుగు నివారణకు రైతులకు నివారణ పద్ధతులుసూచించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి గుమ్మడి వీరభద్రం, ఏఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

### -బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహా నాయక్



రాయపర్తి/డిసెంబర్ 17(జర్నలిస్ట్ వార్త)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని కోరుతూ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నాయకులు మునావత్ నర్సింహ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రాన్ని అందించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను తొలగించాలని లగచర్ల రైతులకు న్యాయం చేయాలని అన్నారు. లగచర్ల రైతుకు బేడీలు వేయడం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, కొలను పెల్లి ప్యాక్స్ చైర్మన్ జక్కుల వెంకటరెడ్డి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు, బీసీ సెల్ అధ్యక్షులు చెవ్వ కాశీనాథం, రాయపర్తి మాజీ సర్పంచ్ గారి నర్సయ్య, మండల పార్టీ నాయకులు ఎలమంచి శ్రీనివాసరెడ్డి, చిన్న ఉప్పలయ్య పోగులకొండ వేణు, అశ్రప్ భాష, చందు రాము, ఉబ్బని సింహాద్రి ,సంకినేని ఎల్ల స్వామి, ఎనగందుల యాదగిరి రవి బాల్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు



రాయపర్తి/డిసెంబర్ 17(జర్నలిస్ట్ వార్త):కోరిన కోర్కెలు తీర్చు కొంగు బంగారంగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీసీ కెమెరాల ఏర్పాటు జరిగింది. కొద్ది రోజుల కిందట గ్రామస్థుల కోరిక మేరకు ఫౌండేషన్ ప్రతినిధి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ నాయక్ విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ పరిపాటి శ్రీనివాస్ రెడ్డి స్వామి దృష్టికి తీసుకెళ్లిన క్రమంలో ఆయన వెంటనే స్పందించారు. రెండు రోజుల్లో కెమెరాలు ఏర్పాటు చేపిస్తామన్న హామీ మేరకు వెంటనే ఏర్పాటు చేపించారు. ఈ సందర్బంగా సురేందర్ రాథోడ్ నాయక్ మాట్లాడుతూ గత కొద్ది రోజుల కిందట ఆలయ సమీపంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయని, ఆలయానికి భద్రత కల్పించాలనే ఉద్దేశ్యంతో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేతను కోరిన వెంటనే స్పందించరన్నారు. ఆలయ భద్రతకోసం ఇప్పటి వరకు పాలకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యకపోవడం విచారకరం అన్నారు. ఆలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే ఏర్పాటు చేయించిన శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి ఎండీ యూసుఫ్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ గూబ యకమ్మ, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ



రాయపర్తి/డిసెంబర్ 17(జర్నలిస్ట్ వార్త): మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కడియం వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంగళవారం బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు.




# ముస్లింల కబరస్థాన్ లో మొక్కలు నాటిన అధికారులు

తల్లాడ/డిసెంబర్ 17(జర్నలిస్ట్ వార్త ):
తల్లాడ మేజర్ పంచాయతీలోని ముస్లింల కబరస్తాన్ లో మంగళవారం మండల అధికారులు మొక్కలు నాటారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా స్మశాన వాటిక చుట్టూ వివిధ రకాల మొక్కలను నాటారు. గ్రామ సభలో ముస్లింల నాయబ్ సదర్ షేక్ మెహరాజ్ కబరస్థాన్ లో మొక్కలు నాటాలని వినతిపత్రం అందించారు. ఈ మేరకు అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్ర మౌళి, ఎంపీవో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ స్థితిగతులను అధ్యయనం చేసిన వ్యవసాయ విద్యార్థులు

తల్లాడ/డిసెంబర్ 17(జర్నలిసస్ట్ వార్త):
తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామం నివాసి, పాలకుర్తి మనీషా గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా అకాడమీ సికింద్రాబాద్ కి చెందిన బి. యస్సి. వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ విధానాలు స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా అధ్యయనం చేసినట్లు కె.వి.కెగడ్డిపల్లి ప్రోగ్రామ్ అసిస్టెంట్, రావే ఇంచార్జ్ ఆకుల నరేష్ తెలిపారు. మంగళవారం అనాజిపురం రైతు వేదిక లో నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సు లో పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో



వ్యవసాయ విద్యార్థులు గ్రామ పటం ద్వారా గ్రామం నందు గల మౌలిక సదుపాయాలు, వసతులు, సాగు భూమి విస్తీర్ణం,నీటిపారుదల, నేల రకాలు, వ్యవసాయ నందు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకొని సదస్సు నందు వివరించడం జరిగింది.గ్రామంలో పండించే పంటల గురించి వివరిస్తూ, రైతులు ఎక్కువగా వరి పంటనే పండిస్తున్నారని, ఒకే పంట పండించడం వలన చీడపీడలు కూడా ఎక్కువ అవుతున్నాయని రైతులకు తెలియజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న ఆకుల నరేష్ కృషి విజ్ఞాన కేంద్రం చేపడుతున్నటువంటి కార్యక్రమాల గురించి వివరించారు .అదేవిధంగా రైతులు సరైన అవగాహన లేక రసాయన ఎరువులు వాడుతున్నారని దీని ద్వారా చీడపీడల ఉధృతి ఎక్కువ అవుతున్నాయని సమగ్ర ఎరువుల యాజమాన్యం ఇతర పంట సాగు గురించి రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో కె. వి. కె ఇన్చార్జి ఆదర్శ్ రైతులు హనుమయ్య, దాసరి లింగయ్య, నాగేంద్ర, మరియమ్మ, సరిత, నాగమ్మ, కళమ్మ, ఉమ రాణి, విద్యార్థులు పాలకుర్తి మనీషా, శ్రీ విద్య, దుర్గ, దివ్య, పూజిత కె.వి.కె శాస్త్రవేత్త. రిక్కు ఉపాధ్యాయులు కె.వి.కె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు

# గ్రామీణ యువత ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్

## - జిల్లాస్థాయి పోటీలను వర్చువల్ గా ప్రారంభించిన మంత్రి కొండ సురేఖ











వరంగల్, డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త): గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడా ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించి ఒలింపిక్స్ లో పథకాలు సాధించాలనే లక్ష్యంతో సీఎం కప్ ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ ఓ (%వా%) సిటీ స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను మంత్రి కొండ సురేఖ వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, వర్చువల్ ద్వారా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గ్రామీణ, పట్టణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వయంగా క్రీడాకారుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ, బడ్జెట్లో క్రీడలకు 375 కోట్ల రూపాయలు కేటాయించిందని మంత్రి అన్నారు.మొత్తం నాలుగు అంచెల్లో(గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర) పోటీలు జరుగుతున్నాయని తెలిపారు.

వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లోని దాదాపు 6000 మంది క్రీడాకారులకు గ్రామీణ, మండల, మునిసిపల్ స్థాయిల్లో పలుక్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయికు ఎంపికైనారని అన్నారు. పారా ఒలింపిక్ క్రీడల్లో జాతీయ పథకాన్ని ఎగరవేసిన దీప్తి జీవన్ జ్యోతిని, జిల్లాకు వన్నె తెచ్చిన ఎంతో మంది క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి, ఏకాగ్రతకు, పోటీ తత్వాన్ని పెంచడానికి ఉపయోగపడతాయని అన్నారు. క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడొద్దని, ముఖ్యంగా కోచ్ లు ఓడిపోయిన క్రీడాకారులకు మానసిక స్థైర్యం కల్పించాలని మంత్రి సూచించారు.

### గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ముఖ్య ఉద్దేశ్యం

గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. 17వ, తేదీ నుంచి 21వ, తేదీ వరకు వరంగల్ లోని ఓ సిటీ స్టేడియంలో, చింతల్ మైదానంలో 36 క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయిలో అధిక పతకాలు సాధించి వరంగల్ జిల్లాను అగ్రగామిగా నిలపాలని కోరారు. వర్చువల్ ద్వారా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే జీవితంలో ఎదుగుతారని అన్నారు.
విద్యార్థి రోజూ నడక, పరుగు వ్యాయామం చేస్తేనే ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికై క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, జిల్లా యువజన క్రీడల అధికారి సత్య వాణి, జిల్లా అధికారులు,జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాస్ యాదవ్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ కార్యదర్శి ధనరాజ్ పుశు, పీఈటీలు, కోచ్ లు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో యువకుడు మృతి






తల్లాడ/ డిసెంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
తల్లాడ మండల ,సప్తగిరి వెంచర్లో పనిచేస్తున్న కూలీ విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. ఈ ఘటన తల్లాడ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మృతుడి తండ్రి అలుగు వెంకటస్వామి తెలిపిన వివరాలప్రకారం కొత్తగూడెం రోడ్డులో గల సప్తగిరి వెంచర్లో ఆంధ్రా రాష్ట్రం పల్నాడు జిల్లా బుచ్చివనేపాలెం గ్రామానికి చెందిన అలుగు వెంకటేశ్వర్లు (34) అనే వ్యక్తి కుటుంబంతో రెండు నెలల క్రితం కూలి పని నిమిత్తం తల్లాడ మండలానికి వచ్చారు. మంగళవారం పని నిమిత్తంలో ఐజాక్సు (కాంక్రిట్? కలిపే వాహనం)లో కాంక్రీట్ కలుపుతున్న సందర్భంలో 11 కేఈ విద్యుత్ తీగలు ఐజాక్స్ బాడీకి తగిలింది.అదే సమయంలో కాంక్రీట్ మిక్సింగ్ యంత్రాన్ని పట్టుకున్న వెంకటేశ్వర్లు ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు తల్లాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు సీపీఆర్ చేసిన తర్వాత ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని చెప్పడంతో 108 వాహనంలో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సప్తగిరి వెంచర్? నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

# నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి

## - టెక్స్ టైల్ పార్కులో ఉపాధి అంశాలపై సమీక్షించిన కలెక్టర్




**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):** జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ విమానాశ్రయం ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్డు, నేషనల్ హై వే గ్రీన్ కారిడార్ తదితర అంశాల పురోగతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సంబంధిత అధికారులతో సమీక్షించి నిర్దేశిత గడువులోగా ఆయా లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లో చేపట్టవలసిన ఉపాధి ఉద్యోగాలు అవకాశాలు, తదితర అంశాలపై. ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి, నర్సంపేట ఉమా రాణి, టిజిఐఐసి జోనల్ మేనేజర్ స్వామి, జిఎం ఇండస్ట్రియల్ సల్మాన్ రాజ్ సంబంధిత మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

# వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

## : - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):**
వసతి గృహాల నిర్వహణపై సంబంధిత అధికారులు, వార్డెన్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో వసతి గృహాల నిర్వహణ, ఏక రీతి ఆహార ప్రణాళిక అమలు, పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో నూతన ఏక రీతి ఆహార ప్రణాళిక పక్కాగా అమలు జరగాలన్నారు. ప్రతి విద్యార్థికి ఆరోగ్య చార్ట్, వైద్య శిబిరాల ఏర్పాటు, పారిశుధ్యం పటిష్టంగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమయ్యే నోటు పుస్తకాలు, బ్లాంకెట్లు తదితర వివరాల ఇండెంట్ ను రెండు రోజుల్లోగా సమర్పించాలని సూచించారు. వంట సరుకులు నిలువ గది తరచుగా పరిశీలించి రక్షణ చర్యలు తీసుకొంటు హైజినిక్ పాటించేలా పర్యవేక్షించాలన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధంగా పాఠ్యాంశాల వారీగా విద్యార్థులను బోధించి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్,జిల్లా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, ఆర్ సి ఓ లు, డి సి ఓ లు, డి ఎస్ డి ఓ లు, వసతి గృహాల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టమస్ పండుగ సందర్భంగా మండల స్థాయి అధికారులతో సమీక్ష








వరంగల్ బ్యూరో, డిసెంబర్ 17,(జర్నలిస్ట్ వార్త):
క్రిస్టమస్ పండుగ 2024 ను పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మైనారిటీ శాఖ అధికారి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, పాల్గొని జిల్లాలోని వివిధ మండలాల తహశీల్దార్లు,, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరానికి క్రిస్మస్ వేడుకల ఫెస్ట్ నిర్వహించుటకు, ప్రభుత్వం నియోజక వర్గానికి 2 లక్షల చొప్పున 6 లక్షలు విడుదల చేసింది. క్రిస్టమస్ పండుగ ప్రశాంతంగా నిర్వహించుటకు నియోజక వర్గ స్థాయిలో క్రిస్టమస్ సెలబ్రేషన్ ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సభ్యులు ప్రజా ప్రతి నిధుల ఆధ్వర్యంలో క్రిస్టమస్ పండుగ ఘనంగా నిర్వహించుటకు నియోజక వర్గ ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులు నియోజక వర్గం పరిదిలో సీసీఓసి కమిటీ ఎంపిక చేసి కమిటీ నిర్ణయం మేరకు డిసెంబర్ 23 లోగా ఫెస్ట్ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్టీవో ఉమరాణి, సంబంధిత అధికారులతో పాటు చర్చి ఫాస్టర్లు పాల్గొన్నారు.

# అడివి శేష్ బర్త్‌డే స్పెషల్..


## 'డెకాయిట్' నుంచి కొత్త పోస్టర్స్ రిలీజ్..

నేడు టాలీవుడ్ యాక్టర్ అడివి శేష్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం డెకాయిట్ నుంచి మేకర్స్ రెండు కొత్త పోస్టర్స్ విడుదల చేశారు. ఇక ఈ సినిమా టైటిల్ కు ఒక ప్రేమ కథ అనే ట్యాగ్ లైన్ కూడా ఇచ్చారు. అయితే, ఇంతకుముందు ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రుతిహాసన్ ను ప్రకటించగా.. ఇప్పుడు ఆమె స్థానంలో మృణాల్ ఠాకూర్ ను తీసుకున్నారు.




ఇక తాజాగా రెండు పోస్టర్లు విడుదల అయ్యాయి. అందులో ఒక పోస్టర్‌ను మృణాల్ 'ఎక్స్' (ట్విట్టర్)లో షేర్ చేస్తూ.. "అవును వదిలేసాను.. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను" అని రాసుకొచ్చారు. దీనికి రిప్లైగా అడివి శేష్ మరో పోస్టర్ షేర్ చేశారు. దీనికి ఆయన.. "అవును ప్రేమించావు.. కానీ మోసం చేసావు.. ఇడిచిపెట్టను.. తేల్చాల్సిందే" అని రాసుకొచ్చారు. ఇప్పుడీ రెండు పోస్టర్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. కాగా, ఈ సినిమాను షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా,

## మెగాస్టార్ తో అనీల్ రావిపూడి మ్యాజిక్!



మెగాస్టార్ చిరంజీవి- అనీల్ రావిపూడి కాంబినేషన్ లో ఓ సినిమా ఉంటుందని కొన్నాళ్లగా ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. అనీల్ వరుసగా సీనియర్ హీరోలను డైరెక్ట్ చేయడంతో? ఆ లిస్ట్ లో మెగాస్టార్ ఎప్పుడు చేరతారా? అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. తాజాగా ఆ ప్రాజెక్ట్ దాదాపు లాక్ అయినట్లు తెలుస్తోంది. అనీల్ కి మెగాస్టార్ గ్రీన్ సిగ్నెల్ ఇచ్చేసినట్లు తెలుస్తోంది. అతి త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వస్తుందని వినిపిస్తుంది.

ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' చిత్రం పూర్తిచేసే పనిలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా పూర్తయిన వెంటనే అనీల్ చిత్రాన్ని పట్టాలెక్కించేలా మెగాస్టార్ సిద్దమవుతున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్ పతాకంపై- సాహూ గారపాటి నిర్మిస్తారని తెలిసింది. అయితే ఇది అనీల్ మార్క్ సినిమాకు భిన్నంగా ఉండే కథ అని సమా చారం. ఇందులో చిరంజీవి క్యారెక్టరైజేషన్ చాలా కొత్తంగా ఉంటుందిట. 'భగవంత్ కేసరి'లో బాలయ్య ను కూడా కాస్త డిఫరెంట్ గా చూపించడంతో ఆ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. రోటీన్ అంశాలున్నా బాలయ్య ఇమేజ్ తో మంచి విజయం సాధించింది. తాజాగా చిరంజీవి ప్రాజెక్ట్ విషయంలోనూ అనీల్ అదే తరహా లాజిక్ అప్లై చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ఏప్రిల్ లేదా మేలో ప్రారంభమవుతుందని అంటున్నారు. అదే జరిగితే మెగాస్టార్ 157 ఈ సినిమా అవుతుంది. ఈ నెంబర్ విషయంలో ఎంతటి డైలమా కొనసాగుతుందో తెలిసిందే. తొలుత ఇదే నెంబర్ తో ఓ సినిమాని చిరంజీవి ప్రకటించి వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత రకరకాల దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. చివరిగా ఇటీవలే 'దసరా' ఫేం శ్రీకాంత్ ఓదెల తో ఓ ప్రాజెక్ట్ లాక్ చేసారు. దీంతో 'విశ్వంభర' తర్వాత పట్టాలెక్కే ప్రాజెక్ట్ అదే అనుకున్నారు. కానీ అంతకంటే ముందు నుంచే అనీల్ మెగాస్టార్ కి టచ్ లో ఉన్నారు. దీంతో అనీల్ కే మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే బోయపాటి శ్రీను తో కూడా మెగాస్టార్ ఓ ప్రాజెక్ట్ అగ్రిమెంట్ చేసుకున్నట్లు వినిపిస్తుంది.

## సూపర్‌హీరో చిత్రంలో 'సాహో' బ్యూటీ



సాహో చిత్రంలో ప్రభాస్ సరసన నటించింది శ్రద్ధా కపూర్. ఆ సినిమాలో శ్రద్ధా అందచందాలు, నటనకు అభిమానులు ముగ్ధులయ్యారు. నిజానికి ఆషిఖీ 2, ఏక్ విలన్ లాంటి చిత్రాలతో శ్రద్ధా ఇటు దక్షిణాదిలోను అభిమానులను సంపాదించుకుంది. ఈ బ్యూటీ ఇటీవలే స్త్రీ 2 లో నటించింది. ఈ సినిమా 2024లో బిగ్గెస్ట్ హిట్ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈ ఏడాదిలో తూ జీ తూ మే మక్కర్, స్త్రీ 2 లాంటి హిట్ చిత్రాలతో అభిమానుల ముందుకు వచ్చిన ఈ బ్యూటీ తదుపరి చిత్రాన్ని ఇంకా ప్రకటించలేదు. ప్రస్తుతం శ్రద్ధా ప్రకటన ఏమిటన్నది సస్పెన్స్ గా మారింది. నిజానికి సినిమాలకు సంతకం చేసే విషయంలో శ్రద్ధా కపూర్ చాలా సెలెక్టివ్‌గా ఉంది. 2020 చిత్రం స్ట్రీట్ డ్యాన్సర్ 3 తర్వాత స్త్రీ 2లో మాత్రమే కనిపించింది. ఆ తర్వాత మరో సినిమాని ప్రకటించలేదు. శ్రద్ధా కపూర్ ఓ సినిమాలో భాగమై నెలలు గడుస్తోంది. ఆమె సైన్ చేయబోయే తదుపరి ప్రాజెక్ట్ ఏది అనేది అంతు చిక్కక అభిమానులు ఉత్కంఠగా వేచి చూస్తున్నారు. బాక్సాఫీస్ బ్లాస్ట్ అయ్యిందిగా.. ఇంతలోనే రెడ్డిటర్లు తమకు తోచిన ఊహాగానాలను ప్రచారం చేస్తున్నారు. శ్రద్ధా గతంలో మాట్లాడిన ఒక వీడియోని వారు షేర్ చేసారు. కాబట్టి నా తదుపరి చిత్రం ఏమిటో ఇప్పుడే అధికారికంగా ప్రకటించలేను. జనవరిలో ప్రకటిస్తాను అని శ్రద్ధా అంటోంది వీడియోలో. ఇది విన్న తర్వాత శ్రద్ధా క్రిష్ 4లో భాగమవుతుందని అనుకుంటున్నట్టు నెటిజనులు ఊహించారు. క్రిష్ 4 గురించి జనవరిలో ప్రకటిస్తామని నిర్మాత రాకేష్ రోషన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. దీంతో శ్రద్ధా ప్రకటన దానికి సమాంతరంగా ఉందని, క్రిష్ 4 గురించే ప్రకటిస్తుందని అంతా భావిస్తున్నారు. ఇంతలోనే ఈ బ్యూటీ దర్శకనిర్మాత సిద్ధార్థ్ ఆనంద్ కార్యాలయంలో కూడా కనిపించింది. సిద్ధార్థ్ ఆనంద్ తదుపరి టైగర్ వర్సెస్ పఠాన్ రూపకల్పనలో బిజీగా ఉన్నారు. ఈ సమయంలో అతడిని కలవడం అంటే కచ్చితంగా యష్ రాజ్ ఫిలింస్ లో శ్రద్ధా పని చేస్తోందని కూడా ఊహాగానాలు సాగుతున్నాయి. అలాగే ఏక్తాకపూర్ నిర్మించే నాగిన్ ఫ్రాంచైజీలో కూడా శ్రద్ధా నటిస్తుందని ఊహాగానాలు సాగుతున్నాయి.

## మహేష్ మాయతో ముఫాసా మాస్ జాతర



ది లయన్ కింగ్.. ఈ హాలీవుడ్ మూవీకి ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఆ సినిమా మంచి పాపులారిటీ సంపాదించుకుంది. ఇప్పుడు ఆ ఫ్రాంచైజీ నుంచి ముఫాసా మూవీ ప్రేక్షకుల ముందుకు డిసెంబర్ 20వ తేదీన రానుంది. ఇంగ్లీష్ తో పాటు తెలుగు సహా అనేక భాషల్లో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. అయితే తెలుగు వెర్షన్ కు గాను సినిమాలోని మెయిన్ క్యారెక్టర్ కు సూపర్ స్టార్ మహేష్ బాబు వాయిస్ ఓవర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మూవీపై ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, ప్రమోషనల్ కంటెంట్.. సినీ ప్రియులను ఓ రేంజ్ లో మెప్పించింది.దీంతో సినిమా కోసం మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. అయితే సూపర్ స్టార్ కేవలం డబ్బింగే చెప్పారు కదా.. కనిపించరు కదా.. మరి ఎందుకంత ఎదురుచూపులు అంటుంటే.. మహేష్ నెక్స్ట్ మూవీ రావడానికి మరో రెండేళ్లు టైమ్ పడుతుందని, అందుకే ఇప్పుడు ఎంజాయ్ చేస్తామని చెబుతున్నారు. మహేష్ బాబు.. ప్రస్తుతం రాజమౌళితో చేయాల్సిన సినిమాతో బిజీగా ఉన్నారు. తన రోల్ కోసం మేకోవర్ అవుతున్నారు. ఇప్పుడు విదేశాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. 29 కంప్లీట్ అవ్వడానికి రెండేళ్ల టైమ్ కచ్చితంగా పడుతుంది. అందుకే ఇప్పుడు ముఫాసా సినిమా ద్వారా ఆయన వాయిస్ ను వింటామని చెబుతున్నారు. బాక్సాఫీస్ బ్లాస్ట్ అయ్యిందిగా.. అదే సమయంలో తమ అభిమాన హీరో సినిమా రిలీజ్ రోజు ఎలా రచ్చ చేస్తారో.. ఇప్పుడు ముఫాసాకు కూడా అలాగే చేయాలని మహేష్ ఫ్యాన్స్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. బ్యానర్లు, కేక్ కటింగ్స్, డీజేలు, డప్పులు, బాణసంచా.. అలా అన్నీ అరేంజ్ చేస్తున్నారని వినికిడి. పెద్ద పెద్ద కటౌట్లు కూడా వివిధ థియేటర్ల వద్ద ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. అయితే మహేష్ బాబు సినిమాలకు పెద్ద అడ్డా అయిన హైదరాబాద్ సుదర్శన్ 35 ఎంఎం థియేటర్ లో ముఫాసా బెనిఫిట్ షోను 20వ తేదీ ఉదయం 8 గంటలకు వేయబోతున్నారు. అందుకు సంబంధించిన టికెట్లకు వేరే లెవెల్ లో డిమాండ్ ఉందట. మొత్తానికి బొమ్మల సినిమా ముఫాసాకు మహేష్ బాబు ఫ్యాన్స్ మామూలు సందడి చేయడం లేదన్నమాట. మరి ఆ మూవీ.. సినీ ప్రియులను ఎలా అలరిస్తుందో వేచి చూడాలి.

## సెలెక్టివ్.. క్రియేటివ్.. కాలిక్యులేటివ్.. శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ ట్రైలర్ టాక్..!

కమెడియన్ గా తన మార్క్ చాటుతూనే సోలోగా సెలెక్టెడ్ సినిమాలు చేస్తున్నాడు స్టార్ కమెడియన్ వెన్నెల కిశోర్. సినిమాలో వెన్నెల కిశోర్ ఉన్నాడు అంటేనే కామెడీ అదిరిపోతుందని అనుకుంటారు. అదే సినిమా లీడ్ రోల్ లోనె వెన్నెల కిశోర్ చేస్తున్నాడు అంటే కచ్చితంగా ఎంటర్టైన్ మెంట్ డబుల్ ఉంటుందని అర్థం చేసుకోవచ్చు. రిజల్ట్ తో పని లేకుండా తన దాకా వచ్చిన ఇంట్రెస్టింగ్ కథలతో సోలోగా చేస్తూ మెప్పిస్తున్న వెన్నెల కిశోర్ లేటెస్ట్ గా చేస్తున్న సినిమా శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్. మామూలుగా డిటెక్టివ్, మిస్టీరియస్ థ్రిల్లర్ కథలకు షెర్లాక్ హోమ్స్ తో పోల్చుతూ మన వాళ్లు సినిమాలు తీస్తుంటారు. కానీ వెన్నెల కిశోర్ లీడ్ రోల్ లో వస్తున్న ఈ సినిమాకు ఏకంగా శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ అనే టైటిల్ పెట్టారు. రైటర్ మోహన్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అనన్యా నాగళ్ల, శియా గౌతం, రవితేజ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. డిసెంబర్ 25న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ విషయానికి వస్తే.. ఊరిలో జరుగుతున్న వరుస హత్యలను చేధించడంలో పోలీసులు చేతులు ఎత్తేస్తే శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ గా పేరున్న డిటెక్టివ్ ని రంగంలోకి దించుతారు. ఇంతకీ ఆ డిటెక్టివ్ వచ్చి ఆ హత్యలు చేస్తున్నది ఎవరన్నది కనిపెట్టాడా లేదా అన్నది ఈ సినిమా కథ. ట్రైలర్ అయితే ఆద్యంతం ఆసక్తికరంగా ఆహ్లాదకరంగా ఉంది. సినిమా ఆడియన్స్ ని ఎంటర్టైన్ చేసేలా ఉంది. ఈ సినిమాను శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్ లో వెన్నపూస రమణా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సునీల్ కశ్యప్, గ్యాని మ్యూజిక్ అందిస్తున్నారు. డిసెంబ 25న రిలీజ్ కాబోతున్న ఈ సినిమా ట్రైలర్ తో ఆడియన్స్ లో బజ్ క్రియేట్ చేయగా సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాల్లో మొత్తం పూర్తిగా నడిపించే కథనం ఒక టైప్ అయితే దానికి కామెడీ జోడించి సినిమా నడిపించడం రెండో టైప్ మరి రైటర్ మోహన్ తాను ఎంచుకున్న కథ కథనాలకు ఎంతవరకు న్యాయం చేశారన్నది రిలీజ్ అయ్యాక తెలుస్తుంది.




## మీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదు?

### : తొక్కిసలాట ఘటనపై సంధ్య థియేటర్‌కు నోటీసులు

తొక్కిసలాట ఘటనకు సంబంధించి హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ యాజమాన్యానికి పోలీసులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రాణం పోయిందని, లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నోటీసులకు పది రోజుల్లోగా వివరణ ఇవ్వాలని హైదరాబాద్ నగర పోలీసులు ఆదేశించారు. ఈ నెల 4వ తేదీన రాత్రి పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందారు. ఆమె కొడుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా, సంధ్య థియేటర్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.

